# ఏ-క్ష-డా లంగ రందలేదు

సీతాపతిని యెదట కూచోపెట్టుకుని ఖద్దరుని గురించి అభూతకల్పనలతో వుపన్యాసం చేస్తూ, రామచంద్రుడు, సూటుకేసు సద్దుకుంటూ వుండగా మెయిలురన్నరు వచ్చి వొక తంతి యిచ్చి వెళ్లిపోయాడు.

విప్పిచూడగా అందులో యిలా వుంది.

"కాంగ్రెస్సుకి నేనూ వస్తున్నాను. చామర్లకోటలో రేపు మెయిల్లో కలుసుకుంటాను.

- సుందరమ్మ"

రామచంద్రుడి కళ్లు జిగిజిగ్గా మెరిసిపోయాయి. హృదయం ఆనందముగ్ధ మయిపోయింది.

"కాకినాడనుంచా యేమిట్రా?"

"సరిగా కనిపెట్టావు"

"ఏమిటి సంగతి?"

"సుందరి కాంగ్రెసుకి వస్తుందిట. మెయిల్లో కలుసుకోవాలి"

"సెబాస్!.... అయితే నేనూ వస్తాను"

"అదేమిటి?"

"నేను వచ్చితీరాలి. లేకపోతే మజా లేనేలేదు"

"ఎందుకోయ్?"

"నీపెళ్లికోయ్"

"అర్థంలేని మాటలు-"

"ఆతంతి కదే అర్థం. ఒకవేళ సుందరమ్మగారికి ఆ వుద్దేశం - అంటే కాంగ్రెస్సు వేదికమీద పెళ్లి చేసుకోవాలనే సరదా లేకపోతే నేను కలిగిస్తాను. అంతమంది మహానాయకుల యెదుట - మహాత్మాజీయెదుట - త్రింశత్కోటికంఠకలకలనినాద-"

"భారత్ - మాత్‌కీ - జె - య్ -య్"

"భారతమాత అంకతలంకంటే పెళ్లికి తగిన చోటేమిట్రా?"

"నువ్వు చెప్పింది బాగానే వుంది; కాని బంధువు లెవరూ - తల్లి కూడా దగ్గిర లేకుండా పెళ్ళంటే సుందరి అంగీకరించదు. మాకేం దొంగతనమా యేమిటి?"

"అదా మాటా? కాంగ్రెస్సు వేదికమీద పెళ్లి చేసుకునే అదృష్టం చక్రవర్తుల కేనా పడుతుందా?... కాంగ్రెస్సు వేదిక అంటే - యజ్ఞవేదిక కాదూ? దేవేంద్రసింహాసనం కాదూ? ఆమాటకి వస్తే శేషతల్పానికేనా అంత మహత్తు వుంటుందా?"

"ఎప్పటి కేనా కాం(గ్రెస్సే ముక్తి–"

"అదలా వుంచు. మన యిళ్ళల్లో జరిగే మామూలు పెళ్ళిళ్ళలో అయితే చదువు లేక, ప్రపంచకం అంటే యేమిటో తెలవక, కులాసా అంటే మొదలే యెరగని స్త్రీలే వస్తారు. కాంగ్రెస్సులో అయితే వందలకొద్దీ దేశ సేవికలూ, నాయకురాళ్లూ, ప్రతినిధురాళ్లూ – సౌందర్యం అంతా అక్కడ లాస్యం చెయ్యదూ? వారిలో వయస్సులోనూ, విద్యలోనూ, రూపంలోనూ, ఆపైని గాత్రమాధుర్యంలోనూ పణమైన యువతులను ఏరి తెచ్చి మీకు మంగళహారతి యిప్పించనూ?"

"వూరించేస్తున్నావురా నన్ను"

"అంతటితో అయిందా?"

"ఇంకా యేమిటోయ్?"

"సరే. అంతమాత్రమే అయితే మజా యేమిటోయ్? .... కాంగ్రె స్సంటే సేనానివేశం కదా? వేలకొద్దీ యోధులు – వారిమీద ఉపనాయకులు – వారిమీద మహానాయకులు – ఆపైని సర్వసేనాధిపతి – కాంగ్రెస్సు వేదికమీద పెళ్లి జరిగే దంపతులకు సైనికమర్యాదలు జరగవుట్రా?"

"నిజమే సుమా! మా శుభకార్యం అకcడే జరిగిందంటే మేమిద్దరమూ బతికివున్నంతకాలమూ కాంగ్రెస్సులోనే లీనమయిపోతాం"

"ఇంకోటి కూడా వుంది"

"నాకు తెలుసు నీసంగతి. ఏం తలపెట్టినా నువ్వు ఆషామాషీగా విడిచిపెట్టేవాడవు కావు"

"కనక విను"

"సరే"

"కాంగ్రెస్సుకి వందలకొద్దీ రిపోర్టర్లు వస్తారు–"

"వొక్కమా టాగు. ఆ సమయంలో నేను చెయ్యవలసిన ప్రతిజ్ఞ చక్కని మాటలతో కూర్చిపెట్టుకుంటాను – లేకపోతే మూడు పద్యాలు – హిందీ మనకి జాతీయ – మాతృ – ఏకైక భాష కనక అందులో వొకటీ – బెంగాలీ స్థానికభాష కనక అందులో వొకటీ – ప్రపంచకం అంతటికోసమూ ఇంగ్లీషులో వొకటీ తయారుచేయించుకుంటాను. ఝామ్మని హిందూస్థానీ కాఫీలో – సూటిగా రేడియో అందుకునేటట్టు–"

"అది సరే. ముందిది విను"

"కానియ్యి"

"ఆరిపోర్టర్ల నందర్నీ నీ పెళ్లి వార్తలు అన్ని పత్రికలకీ – రూటరుద్వారా ప్రపంచకం అంతా – ముఖ్యంగా బ్రిటిషుమంత్రివర్గానికి హడలుపుట్టేటట్టు ఇంగ్లండు పత్రికలకు ముందు అందే యేర్పాటు చేస్తాను. మీఫోటో అన్ని భాషల పత్రికల్లోనూ–"

"అందులో నువ్వుకూడా వుండాలి సుమా"

"దీంతో మీ కిద్దరికీ అలిండియాఫేం వచ్చేస్తుంది"

"మంచి కల్పనరా నీదీ. నాకు నచ్చింది కాదూ?.... మరి నువ్వుకూడా పెట్టి సద్దుకో వెళ్లి"

"నాపెట్టి సద్దుకోడం యెంతరా? లేడికి లేచిందే ప్రయాణం"

"అయితే డబ్బేమాత్రం కావా లంటావ్?"

"వెదవది పెళ్లంటే వెయ్యిరూపాయలేనా లేకుండా యేం రక్తికదుతుందిరా? అధమపక్షం స్త్రీల కేనా - టీ పార్టీ అయినా యివ్వాలా? ఆపైని రానూపోనూ - సుందరమ్మగారి ఖర్చులుకూడా నువ్వే భరించాలికదా?

"నీఖర్చులుకూడా నేనే భరించేస్తాను. ఇక నువ్వు మరోలాగ చెప్పడానికి వల్లకాదు. మరిలే"

"ఖర్చులో ఖర్చు నావంతుకూడా యెందుకూ పాపం"

"విసిరిపారేస్తేను, నాకేం లక్ష్య మనుకున్నావా?"

"నువ్వలాంటివాడవే కానీ-"

"ఇంకేం మరీ?... పదిహేనువందలు చాలవూ?"

"సెలగో సెలగ. దూబరా కాకుండా నేను చూస్తూ వుంటాను కదూ! డబ్బు లేదు; కాని వుంటే నాఅంత పొదుపుగా వాడేవా డెవడూ లేడనుకో. వొక్క దమ్మిడీ ఖర్చు పెట్టా మంటే రూపాయి అందం రావాలి"

"అయితే చేబదులికి ముత్తావారి దగ్గిరికి వెళ్లనా నాళంవారిదగ్గిరికి వెళ్ళనా?"

"నీపాత కాతాదారు-"

"ఇక వాడి మొగం చూడను. వారంరోజుల కిందట, కాశీయునివర్సిటీలో చదువుతూ వున్న తమ బంధువురాలికి పంపడానికి శివప్రసాదరావుగారు మూదువందలు విరాళం కోరగా కభురు చేశాను. రాస్కెల్, ఇవ్వక పోవడమే కాకుండా, నలుగురిలోనూ "ఇదివరకే అరవై వేలు దాటిం" దన్నాట్ట. కలకత్తానుంచి రాగానే యే మారువాడీదగ్గిరో తెచ్చి గిరగిర తిప్పిపారేస్తాను; కాని వాడి పద్దు వుంచుతానూ యింకానూ!"

"అయితే మరి నీయిష్టం వచ్చినచోటికి నడు"

విజయగర్వంతో సీతాపతీ, సుఖమయకల్పనలతో రామచంద్రుడూ వీధిలోకి వచ్చి చెరోవేపుకీ చక్కాపోయారు.

## 2

పంచదార ఫాక్టరీ కనపడగానే తలుపు తెరుచుకు నుంచున్న రామచంద్రుడు, మెయిలు చామర్లకోట ప్లాటుఫారంమీద ఆగీఆగడంతోటే గభీమని వురికి, థెర్మోఫ్లాస్కు

చేతపుచ్చుకుని చిరునవ్వు నవ్వుతూ వచ్చిన సుందరమ్మని స్వాగతం చెప్పి తన కంపార్టుమెంటులో ప్రవేశపెట్టాడు.

అయితే: సుందరమ్మని చూసి పొంగిపోయిన రామచంద్రుడు ఆమె పితామహుడైన వీరప్పయాజుల్ని చూసి కుంగిపోయాడు.

ఎన్నో కల్పనలు చేసి రామచంద్రుణ్ణి కొండ యెక్కించిన సీతాపతి కూడా ముసలాతణ్ణి చూసి గతుక్కుమనిపోయాడు.

రామచంద్రుడూ, సీతాపతీ కూడా, సుందరమ్మ వొక్కర్తే వస్తుం దనీ - లేకపోతే కాంగ్రెస్సుయాత్రల్లో ఆరితేరిన యేప్రతినిధురాలితోనో వస్తుందనీ అనుకున్నారు; గాని "శనిగ్రహం" లాగ యాజులు వెంటపడతాడనుకోలేదు. యాజులు రెండువందల యాభైరూపాయల పెన్షను పుచ్చుకొనే సర్కారు మనిషి కనక అతగాడు కాంగ్రెస్సుకి వస్తాడని వారి కేకోశంలోనూ శంకే కలగలేదు.

ఇంతకీ: యాజు లేనా యేమీ తక్కువ చెయ్యలేదు. పూటకి టికాణా లేనివాడు బోలెడు భూములూ, లక్షరూపాయల నగదూ సంపాదించాడు. కాకినాడ దేవాలయంవీధిలో ఇంద్రసభవంటి పెద్దమేడ కట్టించాడు. చిన్నతనంలో మొగుడు చచ్చిపోగా సుందరమ్మని, మెటిక్యులేషనుదాకానూ, విద్వాన్ దాకానూ చదువు చెప్పించి, సభలకూ, సమావేశాలకూ వెళ్లడానికి స్వాతంత్ర్యం యిచ్చి మళ్ళీ పెళ్ళిచేసునేటట్టు తయారుచేశాడు. పైగా రామచంద్రుణ్ణి పెళ్ళాడడాని కంగీకరించాడు.

వీటన్నిటికీ తోడు తాను దత్తత చేసుకోవాలనే వుద్దేశం పెట్టుకోకుండా - కోడలికి కూడా ఆసంకల్పం కలగకుండా చేసి ఆస్తి అంతా సర్వాధికారాలతోటీ సుందరమ్మకి రాసియిచ్చేశాడు.

ఇంతచేసినా యాజు లంటే రామచంద్రుడికి కంట కింపుగా వుంది. ఎవరేనా వింటే బాగుండదనీ, సుందరమ్మకి కష్టం తోస్తుందనీ- లేకపోతే సుందరమ్మని మనస్సు విరిచేసి మరొకడికి పెళ్ళి చేసేస్తాడేమో అనీ విధిలేక మొగంయెదట ఓహోహో! అంటాడు; గాని కాస్త వెనక్కి మళ్ళాడంటే పళ్లు కొరకడం యేమిటి, గొణుక్కోవడం యేమిటి, తెలిసీ తెలవకుండా వుండేటట్టు కాండ్రించి వుమ్మెయ్యడం యేమిటి - నిజంగా గర్భశత్రువుని చూసినట్టు చూస్తా డతను.

కారణం-మరేమీ లేదు. యాజులు పెన్షనరు. సిగరెట్టు కాల్చడం మంచిది కాదంటాడు. లుంగీకట్టడమూ, కంటిమెడచొక్కా తొడగడమూ పెద్దమనిషి తరహా కాదంటాడు. కద్దరు ముట్టడు. ఇంగ్లీషు మనకళ్లు తెరిచిం దంటాడు. తరుచు కలెక్టరుదగ్గిరికి వెడుతూ వస్తూ వుంటాడు.

నీటి కన్నింటికీ చాటున మరొకటి కూడా వుంది.

సమ్మంధం యిక నిశ్చయం కావడమే తరవాయి అనగా, యాజులు, రామచంద్రుణ్ణి వొక వారంరోజులు తన యింటికి వచ్చి వుండమన్నాడు. తన దినచర్య పరీక్ష చెయ్యడానికి "ముసలా డీయెత్తు యెత్తా" డని అతనికి తెలుసు.

అంచేత అందు కనుగుణంగా అతను చాలాజాగ్రత్తగానే మసులుకున్నాడు; కాని ఆరోజునాటి సాయంత్రం, సుందరమ్మ స్వయంగా కాఫీ తెచ్చియిచ్చినప్పుడు కొంచెం ఖుషామత్తు చేసి ఆమె బుగ్గ తాకాలని వుద్దేశించుకున్నాడు. నాలుగునిమిషాలు వెనకాడి వెనకాడి, చివరికి సాహసించి చెయ్యి చాపాడు. ఆమె కూడా యిదే కోరుతూ వున్నట్టూ, పరవశురాలై వున్నట్టూ, అరమూతలుపడ్డ కళ్లతో చిరునవ్వు నవ్వుతూ నుంచుని వుంది; కాని యిక యిట్టే అనడమే తరవాయిగా వుండగా యేమీ యెరగనట్టు గభీమని యాజులు చక్కావచ్చారు.

ఇది యింతటితోటే ముగిసిపోతే బాగానే వుండిపోయింది.

రామచంద్రుడికి ఆమె బుగ్గతాకా లన్న సరదాపోలేదు. పైగా దీపాలు పెట్టేటప్పటికి కది ఘనీభవించి పడుకునీ లోపున వీలయితే - వీలయితే యేమిటి, యెలాగో వొకలాగ వీలు కలగజేసుకుని గ-ట్టి-గా కౌగిలించుకుని వొకముద్దుకూడా పెట్టుకోవా లన్న దృఢసంకల్పంగా పరిణమించింది.

కాని, రాత్రి భోజనానికి మడికట్టుకో మని సుందరమ్మే వచ్చి చెబుతుం దనుకోగా యాజులు వచ్చి చెప్పాడు. భోజనానంతరం, పోనీ తాంబూల మేనా యివ్వదా అని కనిపెట్టుకోగా తాతగారి దగ్గరికి పిలిపించి యిచ్చింది. అలాగా యిలాగా తిరగడంలోనేనా వొంటిపాటున దొరక్కపోతుందా అని వొడుపువేసుకు కూచోగా తల్లిని విడిచి యివతలికే రాలేదు.

గుటకలు మింగుతూ యిలా వుండగా వుండగా చివరికి సుందరమ్మకి బదులు గాఢనిద్ర వచ్చి అతన్ని అలుముకుంది.

మర్నాడుపొద్దున్న కాఫీ తెచ్చినప్పుడు చెయ్యీ చెయ్యీ తగిలేటట్టు పుచ్చుకోపోగా ఆమె తటాల్న వెనక్కి తగ్గి, నింపాదిగా బల్లమీద వుంచి, "దయచేసి పెళ్లి అయేదాకా నన్ను ముట్టుకోవ"ద్దంది. "నిన్నరాత్రి మాతాతగారు అది మర్యాద కాదన్నా"రని కూడా అనేసింది.

దానిమీద రామచంద్రుడు చల్లబడిపోయాడు.

"ముసలాడు సుందరిని సరిగా కాపరం చెయ్యనిస్తాడా? తాతని కాదని సుందరి మనమాటవింటుందా?" అని అతను సందేహంలో కూడా పడ్డాడు.

కాని "సుమారు లక్షాయాభైవేల రూపాయల ఆస్తి. చక్కని పడుచు. ఎందుకు దాటిపోనివ్వాలీ?" ఇలా అనుకుంటూ అతను వోపిక తెచ్చుకున్నాడు. అయితే మధ్యమధ్య ఏమేమో సందేహాలు పొటమరిస్తూనే వుంటున్నాయి.

## 3

మెయిలు హౌరాస్టేషనులో ఆగింది.

రామచంద్రుడు, సుందరమ్మకి స్వాగతం చెప్పడానికి దేశసేవికలు పరుగుపరుగున వస్తా రనుకున్నాడు; కాని నాలుగు నిమిషాలు చూసినా అలాంటి

దేమీ జరగలేదు. ఇందుకే అత నసంతృప్తుడై వుండగా వొక వాలంటియరు వూగిసలాడుతూ వచ్చి "మీరు మద్రాసీల బసకి వెడతారా, మరాఠీల బసకి వెడతారా?" అని పక్కా యింగ్లీషులో అడిగాడు.

దీంతో రామచంద్రుడికి అరికాలిమంట నెత్తికి వచ్చింది. ఒక్క క్షణం అతను పెదవులు కదపకుండా తీక్ష్ణంగా చూశాడు. ఇంకో క్షణం గంభీరంగా చూసి చివరికి "మేము జాతీయబసకి వెడతాం" అన్నాడు.

"జాతీయబసా" "జాతీయబసా?"

కుడిచేత తర్జనిగోరు మునిపంట కొరుక్కుంటూ వాలంటియరు రెండుమాట్లు ఈమాట పురచ్చరణ చేశాడు; కాని యేమీ బోధపడలేదు. అతని అవస్థ అంతా చూసి రామచంద్రుడు "అవు"నన్నట్టు వురిమిచూడగా వాలంటియరు "ఇదెక్కడి జాతీయాభిమానంరా దేవుడా" అన్న భావం ప్రదర్శిస్తూ "ఇక్కడ బసలన్నీ రాష్ట్రాలవారీగా మాత్రమే ఏర్పరచబడ్డాయి" అని చెబుతూ మరొక ప్రతినిధిని కలుసుకోడానికి వెళ్లిపోయాడు.

ఇంతవరకూ వొక బంగాలీవృద్ధుడితో చాలా చనువుగా మాట్లాడుతూ వున్న యాజులు రామచంద్రుడిదగ్గిరికి వచ్చి "మేము ఆస్తికసభా ప్రతినిధుల బసకి వెడుతున్నాము. మళ్లీ కలుసుకుందాం" అని చెబుతూ దారితీశాడు. "అదిగో, ఆ కనపడే పెద్దమేడేట మాబస. భోజనం చేశాక వొకమాటు అలా రండి" అని చెబుతూ సుందరమ్మ కాళ్లీడ్చుకుంటూ తాతగారితో బయలుదేరింది.

రామచంద్రు డసలే వుడికిపోతున్నాడు. దీంతో అతను నిలువునా నీరయిపోయాడు.

"ఏమంటా?" వన్నాడు సీతాపతి.

"ఇదంతా బంగాలీల స్వార్థపరత్వం. బంగాలీతనాన్ని తప్ప మరొకదాన్ని వీళ్లు గమనించరు. "అరవలతో కలసి వుంటారా మీకు వేరే యేర్పాట్లు చెయ్యాలా!" అని ఆహ్వానసంఘకార్యదర్శి రాసినప్పుడు సాంబమూర్తిగారూ, వెంకటప్పయ్యగారూ చాలాదూరం ఆలోచించి" ఇలాంటి తలతలబసలు ఏర్పాటు చెయ్యవద్దు. హిందువు లయినా సరే, మహమ్మదీయు లైనా సరే, అందరికీ వొక్కటే బస నిర్ణయించండి. కావలిస్తే పెద్ద పెద్ద గదు లేర్పరిచి వాటిలో నేనా అందరూ కలిసే వుండేటట్టు ఏర్పాట్లు చెయ్యండి" అని చాలా గట్టిగా రాశారు. దానికి జవాబివ్వకపోవడమే కాకుండా పైగా తల్లకిందులు చేసేశారు. ఈ విషయంలో ప్రెసిడెంటుగారి దగ్గిరికి వెళ్లి మనం దెబ్బలాడదాం రా. ఇది పరిష్కారమయిాదాకా నేను మరోపని జరగనివ్వను" అంటూ రామచంద్రుడు అగ్గయిపోయాడు"

"మన పని మరిచిపోతున్నావు"

"నిజమే; కాని యింతకంటే నాకు పెళ్లి ప్రధానం కాదు"

"తొందరపడకు. ముందు మన నాయకు లెక్కడ వున్నారో వాకబుచెయ్యి"

"అదంతా పనికిరాదు. మనం తిన్నగా వెళ్లి హిందూస్థానీల బసలో దిగుదాం పద. ఈవిధంగా నేనా యీ నాలుగురోజులూ హిందీవాతావరణంలో గడిపి చెవుల తుప్పు వదలగొట్టుకుందాం"

"నామాట విను. సుందరమ్మగారి బసకి పక్కనే ఒక దక్షిణాది హోటలు వుంది –"

"సాంబరులాండులోకా చివరికి వెళ్లడం?"

"అది లేకపోతే మనకి తెల్లవారడమే; కాని పొద్దు గడవదు. ఇక శాంతించు"

"పోనీ సుందరి బసకే వెడితే?"

"క్షణం సిగరెట్టు లేకపోతే నాప్రాణాలు పోతాయి"

"పోనీ గుజరాతీల బసకి వెడదామా?"

"చేరనిస్తారా?"

"మహాత్ము డున్నాడుగా మనకీ?"

"అవునవును. నీపెళ్లి విషయంలో మన వ్యూహం నెరవేరా లంటే గాంధీమహాత్ముని ఆసరా మనకి తప్పకుండా కావాలి. అదే బాగుంది పద"

"కూలీని పిలు"

ఇద్దరూ కూలీ వెనకాలే బయలుదేరారు. యాభైగజాలు – స్టేషను దాటాటప్పటికి ఒక తెనుగు ప్రతినిధి యెదురయినాడు.

"ఎక్కడ బస!"

"సిక్కుల బసలో"

"అదేం?"

"మాకు ప్రత్యేకంగా బస అక్కర్లేదని రాశారుట మనవాళ్లు. అంచేత అందరికీ బస లున్నాయిగాని మనకి లేదు. మనవళ్లు మహారాష్ట్రుల బసలో కొందరూ, హిందూస్థానీల బసలో కొందరూ, అరవవారి నాశ్రయించి కొందరూ, మహమ్మదీయులకు దగ్గిరగా కొందరూ – వీలయినచోటల్లా వెతుక్కున్నారు"

"మాకుకూడా సిక్కులబసలో చోటు దొరుకుతుందా?"

"సిక్కులయెదట మన తెలుగువాళ్లకి లెక్కేమిటి జమేమిటి? వాళ్లు పదేసిరొట్టెలు ఫలహారవతుగా వూదేస్తారు. తెలుగువాళ్లు వొక్కరొట్టితోటే కెక్కూ కెక్కూ మంటారు. కాకపోయినా మీకు గడ్డాలూ, మీసాలూ లేవు. అక్కడమీకు చోటు దొరకదు"

రామచంద్రుడికి నాడులన్నీ పీకేసిన ట్టయిపోయింది. "చచ్చు తెనుగుదేశంలో యెందుకు పుట్టాలీ?" అంటూ విచారించా డతను.

# 4

కారాకిల్లీ నవులుకుంటూ రామచంద్రుడు, యాదాలాభంగా వీధిలోకి వచ్చాటప్పటికి వొక వృద్ధమహారాష్ట్రుడు కనబడి "మీ దేవూ?"రని యింగ్లీషులో అడగ్గా "రాజమండ్రీ" అనీ రామచంద్రుడు హిందీలో జవాబుచెప్పాడు.

"ఏరాష్ట్రంవారు మీరు?"

ఆ పెద్దమనిషి యింగ్లీషులో మాట్లాడుతూ వున్నందుకే "పళ్లుకొరుకుదామా" అని ఆలోచనలోపడ్డ రామచంద్రుడీ ప్రశ్న విని యిక వోపిక పట్టలేకపోయాడు.

"ముందు మీ దేవూరో చెప్పండి"

"పూనా"

"మీరు మహారాష్ట్రులని నాకు తెలుసు. నే నెవర్నో మారాజమండ్రి యే రాష్ట్రంలోదో మీకు తెలవకపోవడం ఆశ్చర్యకరంగా వుంది. ఈ స్థానికాభిమానాలే మనల్ని పాడుచేస్తున్నాయి"

"ఇందులో స్థానికాభిమానం యేం వుంది?"

"ఏవూరు?... ఏ రాష్ట్రం? మనిషి కనపడేటప్పుటి కిదీ ప్రశ్న. ఇంకా యిది చాలదూ? మనం కాంగ్రెస్సువేదికమీద మన జీవితాలను ఆహుతి చేసేస్తున్నాము. నేటికయినా మన మంతా వొకటి అనేజ్ఞానం కలిగినందుకు సంతోషించడానికి బదులు "మీ రేరాష్ట్రంవారు! అని అడగడంలో సబబు లేదు"

"మన మందరమూ వొకటయితే రాష్ట్రాలు వుండకూడదూ? ఉండవూ?"

"సంపూర్ణ స్వరాజ్యం మనకి దఖలుపడ్డాక హిందూస్థానాన్ని మనం యిష్టం వచ్చినట్టు చేసుకుంటాం; కాని యిప్పటి విభాగాలను అంగీకరించడమూ, ఇలాంటి విభాగాలే కావాలనడమూ మనకి సిగ్గులచేటు"

"మీరు చాలా పై స్థాయిలో మాట్టాడుతున్నారు"

"ముందు, మీరు, హిందీ తెలిసివుండిన్నీ నాతో యింగ్లీషులో యెందుకు మాట్టాడుతున్నారో చెప్పండీ"

"నాకు హిందీ కొంచెమే తెలుసు; కాని మాట్టాడలేను"

"కద్దరు కట్టిన్నీ మీరు - అయితే మీరు కాంగ్రెస్సుకే వచ్చారా?"

"అవును"

రామచంద్రుడు "శ్రీహరీ" అంటూ చెవులు మూసుకున్నాడు.

మహారాష్ట్రుడి కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"మీధోరణి నా కర్థం కావడం లేదు"

"మనదేశం హిందూస్థానం. మనం హిందూజాతి వాళ్లం. మన జాతీయభాష హిందీ-"

"జాతీయ భాషా?"

"ఇంకా సందేహం కూడానా?"

"........"

"మీ యీప్రశ్న కూడా నాకు చాలా దుఃఖం కలిగిస్తోంది"

"మీ మాతృభాష యేమిటీ?"

"మాకేమిటి, మీకేమిటి మాతృభాష అయినా, జాతీయభాష అయినా హిందీభాషే కదూ!"

"అలా అయితే "మనం" అంటూ మమ్మల్ని మీలో కలపకండి. మా మాతృభాష మరాఠీ. మా జాతీయభాష మరాఠీ"

"అయితే హిందీ?"

"ముందుముందు హిందూదేశానికి సామాన్యభాష కావచ్చును"

"కావచ్చునూ? పైగా ముందుందా?"

"...... ముందు, మీరెక్కడివారో తెలవకపోవడం చాలా చిక్కుగా వుంది. దయచేసి చెబుతారా?"

"మద్రాసు ప్రెసిడెన్సీ-"

"ఓస్! మద్రాసీలా?"

"మేము మద్రాసీలం కాము. చెప్పాను కాదూ, మన మంతా హిందువులము"

"అంతర్భాగాలు లేవూ హిందూత్వంలోనూ?"

"మనవంటి దేశసేవకులం వాటికి ప్రాధాన్యం యివ్వకూడదు".

".......పోనీ, మీ రాష్ట్రంలో వున్న పెద్ద నదిపేరు చెప్పండి"

"గోదావరి"

"అది మీ కెంతదూరం?"

"గోదావరి వొడ్డుమీదే వుంది మానగరం. మేము గోదావరిలోనే స్నానాలు చేస్తాము. గోదావరి గాలే పీలుస్తాము. గోదావరి నీరే పుచ్చుకుంటాము"

"..... నిజమే లెండి. దీపంయొక్క కాంతి అద్దాలనుపట్టి మారుతుంది. మరి సెలవూ" మహారాష్ట్రుడు చేతికర్ర వూపుకుంటూ వూచలాగ వెళ్లిపోయాడు. "జాతి యెన్నివిధాల ముక్క లయిపోయిందీ!" అనుకుంటూ రామచంద్రుడు నిర్విణ్ణుడయిపోయాడు.

## 5

ఉదయం యెనిమిదిన్నర అయింది. మధ్యాహ్నం రెండుగంటలకు గాని కాంగ్రెస్సు ప్రారంభం కాదు కనక రామచంద్రుడూ, సీతాపతీ ఆస్తికమహాసభ ప్రతినిధుల బసలకేసి కులాసాగా బయలుదేరారు.

అక్కడ విశాలమయిన వొక గదిలో చాలామంది స్త్రీలు నుంచుని వున్నారు. పరకాయించి చూడగా వారి కందరికీ మధ్య సుందరమ్మ వుంది. ఆమె స్త్రీమండలిలో అంత ప్రాధాన్యం పొందుతూవున్నందుకు రామచంద్రుడికి చాలా ఆనందం కలిగింది. ఆమె వెనక అరవ స్త్రీలూ, కన్నడ స్త్రీలూ, మళయాళీ స్త్రీలూ వున్నారు. ఆమెకి యెదట గుజరాతీ స్త్రీలూ, బంగాళీ స్త్రీలూ, హిందూస్థానీ స్త్రీలూ వున్నారు.

చూడగా సుందరమ్మ కొంచెం వుద్రిక్తురాలై వున్నట్టుంది.

"మీధోరణి చూస్తే పెద్దమనిషి, తరహా యేమీ కనపడ్డం లేదు. మమ్మల్ని చూసి మీరెందుకూ నవ్వు కుంటున్నారూ?"

"మీ రెవరూ ముసుగులు వేసుకోలేదేం?"

"మీ రెందుకు వేసుకున్నారూ?"

"వేసుకోడం మాదేశాచారం"

"వేసుకోకపోవడం మాదేశాచారం"

"మా దేశంలో ముసుగు లేని స్త్రీ వేశ్య అన్నమాట"

"మా దేశంలో ముసుగు ఉన్న స్త్రీ వితంతు వన్నమాట"

ఇది విని బంగాళీ స్త్రీలూ, గుజరాతీ స్త్రీలూ, హిందూస్థానీ స్త్రీలూ మొగమొగాలు చూసుకున్నారు. అరవ స్త్రీలూ, కన్నడ స్త్రీలూ, మళయాళీ స్త్రీలూ సుందరమ్మని మెప్పుచూపులతో చూశారు.

"మీ రిప్పుడు మా దేశంలో వున్నారు కనక ముసుగులు వేసుకోవాలి"

"మీరు మా దేశం వస్తే ముసుగులు తీసుకు సంచరిస్తారా?"

"చెప్పాం కాదూ? ముసుగు లేకపోతే వేశ్య"

"మేమూ చెప్పాం కాదూ? ముసుగుంటే వితంతువు"

ఉభయపక్షాలవారి కళ్లల్లోనూ మెరుపులు మెరిశాయి. కాని సరిగా యీసమయంలో సభాప్రారంభానికి సూచనగా శంఖాలు పూరిమాయి.

అందరూ బయలుదేరారు.

కాని రామచంద్రుడూ సీతాపతీ కనపడ్డంవల్ల సుందరమ్మ వొక్క అడుగు ముందుకు వేసిన్నీ నిలిచిపోయింది.

"వాళ్లతో మీకు వాదం యెందుకండీ!" అన్నాడు సీతాపతి.

"ముసుగు వేసుకోవడమే చాలా మంచిది. దానికి వ్యతిరేకంగా వాదించడం సరసమైన పని కాదు" అన్నాడు రామచంద్రుడు. సుందరమ్మ చూపిన తొందరకి చాలా కించపడుతున్నా డతను.

"అయితే మన దేశంలో ముసుగు వేసుకునీ ఆచారం యెందుకు పుట్టింది కాదూ?" అని చురచుర చూస్తూ అడిగింది సుందరమ్మ.

"మన దేశం కూడా వొక దేశమేనా? హిందూస్థానంలో కల్లా నిగ్గయిన సంప్రదాయం గుజరాతీలదీ, హిందూస్థానీలదీ, బెంగాళీలదీనీ. సాంఘిక విషయాల్లో హిందూస్థానాని కంతా వారే ఆదర్శమూర్తులు"

"అంచేతే కామోసు మీరు చెప్పిన దేశాలలో తురక లధికంగా వున్నారు"

"హిందూస్థానంయొక్క చరిత్ర తప్పుగా రాయబడి వుంది. దాన్ని చదవడంవల్ల మనం మారుదారిలో పడిపోయాం"

రామచంద్రు డిలా అంటూ వుండగా యాజులు వులుకూ వులుకూ చూస్తూ వచ్చి "సభ ప్రారంభం అవుతూ వుండగా యింకా యిక్కడే వున్నా వేమమ్మా?" అంటూ కొంచెం కోప్పడ్డాడు. సుందరమ్మ అటూ యిటూ చూసి, తాను తప్ప మరొక స్త్రీ అక్కడ లేకపోయినందుకు కంగారుపడుతూ లేడిపిల్లలాగ మాయమయిపోయింది.

"సుందరమ్మగా రెంత చకచకా మాట్లాడతారూ యింగ్లీషూ!"

"నిజమే - ఇంకా యీధాటీ వొక లెక్కలోదే కాదూ; కాని సాంఘికమర్యాదల విషయంలో సుందరి వుత్తరహిందూస్థానంవారితో భేదించడము, - పైగా దెబ్బలాటకి సిద్ధపడ్డట్టు ఖండితంగా వాదించడమూ నాకు చాలా దుఃఖం కలిగిస్తున్నాయి."

"పోని, వాళ్ల ప్రాంతంలో అది ఆచారం కామోసుననుకుని వుత్తర హిందూస్థానంవాళ్లు వూరుకోగూడదూ?"

"వొరేయే! ఇన్నాళ్లనుంచి నాతో తిరుగుతున్నావు; కాని నీకు జాతీయదృష్టి పూర్తిగా బలపడలేదుసుమా"

రామచంద్రు డిలాగ చర్రు మనగా సీతాపతి మొగం వంచుకుని మాట్లాడకుండా ముందుకి అడుగువేశాడు.

## 6

రామచంద్రుడూ, సీతాపతీ నింపాదిగా ప్రతినిధుల బసలకేసి బయలుదేరారు.

"రేపు రాత్రితో కాంగ్రె స్సాఖరు. తెలుసునా? ఎల్లుండి ప్రయాణానికి ప్రారంభం"

"ఎరుగుదును. సుందరమ్మగారితో రహస్యంగా మాట్లాడ్డానికి వీలులేకుండా వుంది. ముసలాడు ప్రయివేటుశక్రటరీలాగ ఆమెని క్షణమేనా విడిచిపెట్టకుండా వున్నాడు"

"ముందుముందు కూడా యీపిశాచం యిలాగే వుండీలా వుంది. ఏమీ తోచడం లేదు"

"కాని రాజేంద్రబాబుతో మాట్లాడాను. బీహారు వుప్పెనకి నువ్వుసొంతంగా వెయ్యిన్నూటపదహార్లు పంపిన మాటా, దాని కాయన జవాబుగా ప్రశంస చేస్తూ పెద్ద తంతియివ్వడమూ జ్ఞాపకం చేశాను. పైగా మహాత్ములవారు, యువకు లందరూ వితంతువివాహాలు చేసుకోవాలంటూ చేసిన ప్రకటన కూడా జ్ఞాపకం చేశాను. ఆప్రకటన ననుసరించే నువ్వు వితంతువుని పెళ్లిచేసుకోడానికి సిద్ధపడ్డా వనిన్నీ - కోసేశాను."

"సెబాస్!... ఏమన్నారు దానికి?"

"మహాత్ములవారితో ఆలోచించి చెబుతామన్నారు"

"హో-య్యే-స్స్! అయితే తప్పకుండా అయిపోయిం దన్నమాటే; కాని.... అయితేనూ సుందరి వొప్పుకుంటుందో లేదో, ముందేయిదంతా యేర్పాటు చేసేస్తే యెలాగా?"

"నీకా భయం అక్కర్లేదు. మీ వివాహం యిక్కడ జరగాలని మహాత్ముడు పట్టుబడుతున్నా డంటే-"

"భేష్!.... అయితే తల్లిరాకుండా - ముసలాడు అంగీకరిస్తాడా?"

"మహాత్ముడి సెల వయిం దంటే విమానం వచ్చి మన కాళ్లదగ్గిర వాలదుట్రా? నిమిషాలమీద నేను కాకినాడ వెళ్లి నీఅత్తగారిని తీసుకురానూ?"

"వేశావురాటంకంపోడీ. బలే. మరి అదేదోచూడు"

"ఇవాళ దీపాలు పెట్టేటప్పటి కన్నీ సిద్ధం కావడమూ, సరంజా మంతా తయారు కావడమూ, నీఅత్తగారు రావడమూ అయిపోతా యనుకో, రాత్రి విషయ నిర్ణయసభ ప్రారంభం అవుతుం దనగా వివాహం. బాగుందా?"

"నిక్షేపంలా వుంది; కాని అప్పటి కప్పుడు కంగారవుతుంది. చరఖాసంఘానికి వెళ్లి మాంచి కద్దరుచీరా, జాకెట్టూ, జామారూ పట్టుకువచ్చి బసలో వుంచు. ఒక వందా, వందయాభై హారతికర్పూరపు దండలికి బజానా యిచ్చీ సెయ్యి. లేకపోతే, తీరా నువ్వు కాకినాడ వెళ్లి ఆసమయానికీ వస్తే యివన్నీ యెలా వస్తాయి? ఇంకో అరగంటకి సభా ప్రారంభం అవుతుంది. ఈలోపుగా నేనీప్రాంతంలో షికారుకొడుతూ వుంటాను. నువ్వు వెళ్లు"

సీతాపతి వెళ్లిపోయాడు.

❀ ❀ ❀

రామచంద్రుడు ముందుకి బయలుదేరగా మొట్టమొదట అరవల బస తగిలింది. లోపలికి వెళ్ళిచూడగా రాజగోపాలచారి, సత్యమూర్తి, సాంబమూర్తిగార్లు ఇంగ్లీషులో మాట్లాడుకుంటున్నారు. అందుకు రామచంద్రుడు చాలా కటకట పడుతూ నుంచున్నాడు. అది చూసి సాంబమూర్తి గారతగాణ్ని "నుంచుంటావేం! ఇలాకూచో" అంటూ యింగ్లీషులో ఆహ్వానించారు.

"మీరు ముగ్గురూ త్యాగమూర్తులు. మన జాతీయ భాషను విడిచిపెట్టి జాతీయ సభా పర్యటకాలలో యింగ్లీష్ భాషలో మాట్లాడటం మా వంటి సేవకుల కందరికీ నిరుత్సాహం కలిగిస్తోందన్నాడు" రామచంద్రుడు.దానికి సాంబమూర్తిగారు మొదట నవ్వి, తరవాత వురవురా చూస్తూ "ఇదా యిప్పుడు మనకి విషయం? అవతల సంపూర్ణ స్వరాజ్యతీర్మానం యేమయిపోతుందో చూసుకోవాలా, చిల్లర విషయాలా" అన్నాడు.

అప్పుడు సత్యమూర్తిగారు "ఏమిటి సంగతీ?" అని అడిగి తెలుసుకుని "హిందీ మనకి జాతీయభాష. దాన్ని కాదన్నవాడికి భారతీయత లేదన్నమాట. మన

విముక్తి అందులోనే గర్భితం అయివుంది. దక్షిణభారతదేశంలో వొక్క పురుషాంతరంలో సకల భాషలనూ వెనక్కి తోసేసి అదే స్థిరపడిపోతుంది. సందేహం లేదు; కాని మన కార్యక్రమం బ్రిటిషువారికి కంగా రెత్తించా లంటే యిప్పట్లో యింగ్లీషు వాడకతప్పదు. ఇది స్వల్పవిషయం. మాకు అడ్డుతగలకండి. వింటూ కూచోండి. అవతల జస్టిస్సు పక్షం పైకి రాకుండా చెయ్యాలి మనం. మన జీవిత లక్ష్యం అంతా అదీ. చూడండీ. సాంఘికనిర్ణయం విషయంలో మాళవ్యాగారి మాట తోసెయ్యడానికి మీరంతా ప్రచారం చెయ్యకుండా యిలా కూచుంటే యెలాగా? నేనూ రాజాజీ యీవిషయమే ఆలోచిస్తున్నాము. అదీగాక: మాళవ్యాగారివల్ల యేమీ కాదనీ, పైగా అయనవల్ల హిమగిరిశృంగం అంత అపాయంకూడా సంభవిస్తుందనీ గ్రహించి, అసెంబ్లీ వ్యవహారంతో తమ విశ్వాసమూ, తమ ఆశా నా వొక్కడిమీదా కేంద్రీకరించుకుని వున్నారు మహాత్ములవారు. ఒక్క రాజాజీ చాతుర్యంవల్ల అసెంబ్లీ యినపకోట మనకి పూర్తిగా స్వాధీనం అయిపోయివుంది. అక్కడమనం మన వాగ్ధాటీ చూపించాలంటే ఇంగ్లీషుని బహిష్కరిస్తే యెలాగా? దేశంలో జరిగే సభలన్నింటిలోనూ విద్యాధికులు పదులమీదా, నిరక్షకుక్షులు వేల మీదా వుంటారు. వారి దగ్గిర నాపాండిత్యం యేం కనపరిస్తే యేంలాభం? అసెంబ్లీ అంటే హేమాహేమీల పుట్ట. అక్కడ మన వక్తృత్వ వైభవం కనపరిస్తే వుండే ప్రయోజనం మీరేమైనా గ్రహించారా? కనక యీ విషయం మీకు తెలివదు. అంటే మీకీ విషయంలో విచారణ అవసరం లేదు. మా ఆజ్ఞలు నిర్వర్తించడంలో మీరు చాలా శ్రద్ధచూపవలసివుంది. ఒక్క క్షణంలో సాంబమూర్తిగారు కూడా మీతో కలుసుకుంటారు వెళ్లండి" అంటూ గుక్క తిప్పుకోకుండా మాట్లాడారు.

మూడు ఇడ్లీ సాంబారుప్లేట్లతో టీపాయి పట్టుకుని వొక అయ్యగారి యువకుడు "వొత్తుంగో, వొత్తుంగో అంటూ రామచంద్రుడికి ద్వారం దగ్గిర యెదురుపడ్డాడు.

## 7

పదడుగులు వేశాటప్పటికి సుందరమ్మా నలుగురు మహారాష్ట్రయువతులూ అతణ్ణి కలుసుకున్నారు. సంభాషణలో వుభయపక్షాలూ కూడా ప్రతినిధుల బసలు చూడడానికే బయలుదేరడం స్పష్టపడింది.

యువతులను వెంటబెట్టుకొని అతను ముందున్న బంగాళీల బసకి వెళాడు; కాని "లోపలికి వెళ్ళడానికి వల్లకాదని ద్వారం దగ్గిర వున్న యువకు డటకాయించేశాడు. తొంగిచూడగా లోపల అంతా మధ్యవయస్కులూ, యువకులూ, కొందరు యువతులూ తప్ప వయస్సు మళ్లినవా రొక్కరూ కనపడలేదు. పైగా చర్చకూడా వినపడీ వినపడనంత మెల్లిగా బంగాళీభాషలో జరుగుతోంది.

కాంగ్రెస్సులో ప్రధాన భాగస్వాములై వుండిన్నీ వారు తనను - సాటి కాంగ్రెస్సువాదులను అటకాయించడమూ, అన్ని విషయాల్లోనూ బాగా ముందుకు

వెళ్లినవారయ్యుండిన్నీ హిందీని విడిచిపెట్టి బంగాళీలో చర్చించుకోవడమూ అతనికి అసంతృప్తి కలిగించాయి.

పైగా ముసుగు లేని సుందరమ్మకేసి వొకరిద్దరు యువకులు అదేపనిగా చూడ్డం కూడా అతనికి వేడిపుట్టించింది.

కాని యీవిషయంలో తప్పంతా తెలుగుజాతిలోనే కనపడిం దతనికి. "అరవల సహవాసఫలం యిది" అనుకున్నా డతను. పైగా సుందరమ్మకి కొంచెం దగ్గిరగా వెళ్లి, మెల్లిగా "మేలి ముసుగు లేకపోతే మనం యిక్కడ నెగ్గలేం" అన్నాడు.

సుందరమ్మ దెబ్బతిన్న ఆడతాచులాగ తిరిగిచూసి జవాబు చెప్పకుండా ముందుకి బయలుదేరింది.

❀ ❀ ❀

తరవాత హిందూస్థానీల బస తగిలింది. రామంచంద్రుడు పొంగిపోయాడు. వొకయువకుడితో సంభాషణ ప్రారంభించాడు.

"మీభాష హిందూదేశాని కంతటికీ జాతీయభాషగా ఏర్పరచబడ్డందుకు నేను నా ప్రాంతీయుల పక్షంగా చాలా ప్రశంసిస్తున్నాను. మా ప్రాంతంలో సకల విషయాలలోను హిందీభాషే చెలామణీ కావడానికి మాయువకులు చాలామంది నిద్రాహారాలు మాని పనిచేస్తున్నారు"

'అది మంచిపని. అనేక భాషలతో మనం కుళ్లిపోతున్నాం. ప్రపంచకంలోకల్లా హిందీ వొక్కటే మధురమైన భాష. దాన్లోనే మనకి ముక్తి వుంది. హిందీ లేదంటే హిందూత్వం లేదన్నమాట. హిందీని నేర్చుకుంటూ మీవాళ్లు ముందుకి వస్తూవున్నందుకు మిమ్ము ప్రశంసిస్తున్నాను. ఈమధ్య మీవాళ్లు చాలామంది యీప్రాంతాలకు వచ్చి తమ హిందీసేవలు మాకు నివేదించి ధన్యత పొందారు... మంచిది... సంతోషం... మీరు కూడా హిందీ ప్రచారం చేస్తున్నారని నమ్ముతున్నాను. దక్షిణ భారతదేశంలో సకలవిషయాలలోనూ హిందీకే ప్రాజాపత్యం యివ్వకలిగినప్పుడే మీకు విముక్తి"

"చిత్తంచిత్తం. ఇటీవల మాప్రాంతీయ భాషలు కొంచెం రెపరెప లాడాయి; గాని హిందీప్రచారకులు చదువురాని వారికి కూడా హిందీ నేర్పి ఆవుద్ధృతం అంతా కూల్చేశారు. మానాయకులు వొక్క హిందీతప్ప తతిమ్మా అన్ని భాషలూ చచ్చిపోతేనే మనకి సంతోషం" అని చెబుతూ ప్రజలను హిందీముగ్ధులుగా మార్చేస్తున్నారు"

"అది చాలా మంచిపని. పత్రిక లేం చేస్తున్నాయి?

"కొన్ని, కొన్ని పేజీలలో హిందీ వ్యాసాలు కూడా ప్రకటిస్తున్నాయి. పెద్దపత్రికలు ఇకముందు తెనుగుని పూర్తిగా విడిపెట్టెయ్యడానికి ఆలోచనలు చేస్తున్నాయి"

"బాగుంది. సభలోకి వెళ్లవలసిన సమయం అవుతోంది. అనకరండి. మానాయకుల దర్శనం చేయిస్తాను... మీలో స్త్రీలు కూడా హిందీ నేర్చుకుంటున్నారు కదా?"

"నేర్చుకుంటున్నారండి"

"స్త్రీలే హిందీ నేర్చుకుంటే పిల్లలకు ప్రాంతీయభాషలు రాకుండాచేసి హిందీలోనే తయారుచేస్తారు. స్త్రీలు హిందీ నేర్చుకోవా లనడానికి కారణం యిదీ. ముందు ప్రాంతీయభాషలు నేర్చుకుని తరవాత వాటిని మరిచిపోవడమూ, హిందీనేర్చుకోవడమూ యెందుకూ? ....ఏమంటారు?"

"అవునండి. ఈ వ్యాఖ్యానం బాగుంది. మీరిలా సెలవిచ్చినట్టు నేను వెళ్లి ప్రచారం చేస్తాను"

"వద్దువద్దు. అభివృద్ధినిరోధకులు మీలోచాలామంది వుంటారు. వారు ప్రజలకు అపార్థాలు కల్పించిచెప్పి మన ఉద్యమానికి భంగం కలిగించవచ్చు"

"చిత్తమండి, అదీ నిజమే. మావాళ్లంతా వోర్ఠి పిరికివాళ్లు. ఏదీ సాహసించి చెయ్యలేరు. మరి సెలవిప్పించండి"

"వెళ్ళండి"

రామచంద్రుడికి దేవుడు సాక్షాత్కరించి వరం యిచ్చినట్టయింది, "ఇక రండి" అంటూ అతను యువతులను పిలుచుకుని కాంగ్రెస్సుసమావేశానికి వెళ్లాడు.

❀ ❀ ❀

అప్పటి కప్పుడే సభ కిటకిటలాడిపోతోంది. చూడగా పట్టాభిసీతారామయ్యగారు హిందీలో అనర్గళంగా మాట్లాడేస్తున్నారు. అది చూసి రామచంద్రుడు "సెబాస్! మన పరువు నిలవబెట్టా రండీ మహానుభావా" అంటూ చేతులు జోడించి, కళ్లు మూసుకుని తనకి తానే ధన్యవాదాలు చెప్పుకున్నాడు.

మరో రెండు నిమిషాలకి సభలో నాలుగువేపులనుంచీ ఏదో గోలబయలుదేరింది. తనలాగే సభ్యు లందరూ ధన్యవాదాలు చేస్తున్నా రనుకున్నాడు రామచంద్రుడు; కాని కాస్తసేపు నిదానించగా "మీహిందీ మాకేమీ బోధపడడం లేదండోయ్" "ఇంగ్లీషులో చెప్పండోయ్" అంటూవున్నట్టు స్పష్టంగా వినపడింది.

రామచంద్రుడికి రక్తం వుడుకెత్తిపోయింది. కళ్లు చీకట్లు కమ్మేశాయి. దాంతో ఆగోలలో గోలగా అతను గూడా యేమిటేమిటో గావుకేకలు మొదలుపెట్టాడు.

అయిదునిమిషాలు కష్టపడి, శాంతీ నెలకొల్పి, పెద్దలు, సీతారామయ్యగారిని ఇంగ్లీషులోకి మళ్లించారు. రామచంద్రుడు అది చూసి "సిగ్గుసిగ్గు" అంటూ కూలపడ్డాడు.

సరిగా యీసమయంలో వెతుక్కుంటూ వచ్చి సీతాపతి గడగడ వణికిపోతూ "మన పెట్టెలు దొంగలు పట్టుకుపోయా"రన్నాడు.

"ఏమిటీ?"

"చివరికి తువ్వాలుకూడా మిగల్చలేదు.

"........"

"ఎన్ని విధాల పోరినా పెట్టెలోనే అట్టేపెట్టావు; కాని సొమ్ము కూడా తెచ్చావా? ఖర్చయింది అయిపోగా పూర్తిగా పధ్నాలుగువందల రూపాయలు, పోలీసు వారికి రిపోర్టుచేద్దాం రా"

"తప్పుతప్పు"

"........"

"కాంగ్రెస్సు ఆవరణలో - ప్రతినిధుల బసలో చోరీ జరిగిం దని రిపోర్టుచేసి పోలీసువారిసాయం కోరితే యిక పరు వేమేనా తక్కుతుందా? వెధవసొమ్ము పోతేపోయింది. పోలీసులు వచ్చారంటే బస లన్నీ తిరగతోడతారు. దీంతో విదేశీపత్రికలు ఇక వొంటికాలి భరతం మొదలుపెడతాయి. గప్‌చిప్. మాట్లాడకు"

"ఇంటికి వెళ్లడానికి-"

"తంతికొట్టి వందరూపాయలు - గంటలో గఖ్ఖున రాలతాయి. పరపతి లేని దద్దమ్మనిట్రా నేనూ?"

"మరి పెళ్ళిప్రయత్నం-"

"ఇప్పుడు వద్దు. ఇంటికి వెళ్ళాక చూసుకుందాం"

సీతాపతికి వణుకు తగ్గింది.

రామచంద్రు డలాగే కూచుని వుండగా సీతాపతి "ఆ చోకీ యేమానా దొరకుతుందేమో చూస్తూ వుంటా" నని చెబుతూ రామచంద్రుడు పిలుస్తూ వున్నా వినిపించుకోకుండా చక్కాపోయాడు.

## 8

కాంగ్రెస్సు పూర్తయిపోయింది. ఎన్ని విధాల వెతికినా, వాకబు చేసినా సుందరమ్మ జాడా జవాబూ కనపడలేదు. ఆస్తికసభానిర్వాహకులు కూడా ఏమీ చెప్పలేకపోయారు.

రామచంద్రు డింటికి వచ్చిన మూడోనాటి పొద్దున్న తొమ్మిదిగంటలికి వొక వుత్తరం వచ్చింది. విప్పిచూడగా అందులో అక్షరాలు కాక సూదు లున్నట్టు తోచిందతనికి. కొంతసేపటిదాకా అతనూ నిర్ఘాంతపడిపోయి "కాకినాడనుంచేనా?" అని సీతాపతి అడగ్గా అప్పుడు ప్రకృతిలో పడి ఆవుత్తరం అతనిమీద గిరవాటు వేశాడు.

అత నిలా చదివాడు.

"నేనూ మా తాతయ్యగారూ నాలుగురోజులకిందటే యింటికి వచ్చాము. ఈపాటికి మీరున్నూ రాజమండ్రీ చేరుకునే వుంటా రని నమ్మి యీ వుత్తరం రాస్తున్నాను.

"కాంగ్రెస్సుసమయంలో మీభావాలూ, వుద్దేశాలూ నాకు బాగా బోధపడడం నా అదృష్టం. అతిదారుణమైన విపత్తులో కూలిపోకుండా నన్ను కాపాడినందుకు పరమపితకు నేను అనేకకోట్ల వినతులు సమర్పిస్తున్నాను.

"నేను తెనుగుజాతిలో పుట్టాను తెనుగుతనమే నా బొందిలో వున్న వూపిరి. అదే నాకు జీవగర్ర.

"నేను తెనుగుతనం అర్థం చేసుకోలేనివాళ్లని క్షమిస్తాను. ఆప్రయత్నం చెయ్యనివాళ్లని కూడా దయతలుస్తాను; కాని తెనుగుతనం లేని తెలుగుమనిషినీ, తెలుగు తనాన్ని నిందించే తెనుగుమనిషినీ పలకరించను. కన్నెత్తి చూడను. మనస్సులో నేనా స్మరించను.

"కాంగ్రెస్సు పేరుచెబుతూ మీరు ఆత్మద్రోహం చేసుకుంటున్నారు. ఆంధ్రజాతికి మీకంటే వేరుపురుగు లేదు.

"మీకూ నాకూ ఎప్పటికీ వివాహం పొసగదు ఇక నా మీద ఎంతమాత్రమూ ఆశపెట్టుకోవద్దు.

"నా హృదయంలో అంకితం అయివున్న మీరూపాన్ని అప్పుడే నేను సగం తుడిచేసుకున్నాను. తక్కింది కూడా పూర్తిగా చెరిగిపోయిదాకా నాకు నిద్రపట్టదు. ఆహారం సయించదు.

"మిమ్మల్ని తలుచుకుంటూ కొన్నికొన్ని సుఖమయ కల్పనలు చేసుకోవలసి వచ్చినందుకు నేను చాలా సిగ్గుపడుతున్నాను.- - సుందరమ్మ"

ఇది విని రామచంద్రుడు నిర్విణ్ణు డయిపోయాడు. సీతాపతి సాంత్వనం చెయ్యగా చెయ్యగా నాలుగైదు నిమిషాలకి తెలివితెచ్చుకుని, కోపం కూడా రప్పించుకుని "నాకుకూడా ఘోరవిపత్తు తప్పిపోయింది. భారతమాత అనుగ్రహంవల్ల నేను బ్రహ్మరక్షస్సు చేతిలో చిక్కకుండా తప్పించుకో గలిగాను. ఆ యేబ్రాసిపీనుగు కాళ్లమీదపడి ప్రార్థించినా యిక నేను పెళ్లాడను. నాయెదట కూడా నుంచోనివ్వను. నాకళ్లబడనివ్వను. ఇంతేకాక అసలు నేనిక తెనుగు పిల్లనే పెళ్లిచేసుకోను. అయినకాడికి నాఆస్తి అంతా తెగనమ్మేసి, అలహాబాదులో ప్రవేశించి, అక్కడి నాయకుల నాశ్రయించి వొక హిందూస్థానిపిల్లని పెళ్లిచేసుకుంటాను. నేను ప్రయత్నపూర్వకంగా తెనుగు రక్తాన్ని విరిచేసుకుంటాను. తెనుగుబాష మరిచిపోవడమే కాకుండా నాబిడ్డలకి తెనుగు ధ్వనికూడా చెవిని పడకుండా వుండేటట్టు చేస్తాను" అంటూ సీతాపతి చేతిలోవున్న వుత్తరం వుళాక్కుని, ముక్కలు ముక్కలుగా చించేసి వీధిలో చిమ్మేసి ఇంటోకి పోయి మంచంమీద కూలపడ్డాడు.

మరో క్షణానికి తల పంకించుకుంటూ సీతాపతి తన యింటికి చక్కాపోయాడు.

*(ప్రబుద్ధాంధ్ర - మే, 1935)*